సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌కుమార్

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

కులకచర్ల, జూన్ 1 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సాల్వీడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌కుమార్, బొంరెడ్డిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేశ్‌కుమార్ తెలిపారు. శనివారం కలకచర్ల మండల పరిధిలోని ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో అన్ని విధాలైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉన్న బడీడు పిల్లలు పాఠశాలల్లో చేర్పించాలని, దీనికి అమ్మ ఆదర్శ కమిటీ పాత్ర కూడా ఉందన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చైర్‌పర్సన్లు, ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి

పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన ఏఎస్పీడీ

పాఠశాలలో తాగునీటి నల్లాలను పరిశీలిస్తున్న ఏఎస్పీడీ రమేశ్, డీఈవో రేణుకాదేవి

బొంరాస్‌పేట, జూన్ 1 : మండలంలోని బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల, బొంరాస్‌పేట ప్రాథమిక, బాలికల ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మన ఊరు–మనబడి పథకం ద్వారా చేపట్టిన పనులను రాష్ట్ర సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేశ్ శనివారం పరిశీలించారు. ఎన్ని నిధులు మంజూరయ్యాయి, మంజూరైన నిధులతో ఎలాంటి పనులు చేపడుతున్నారు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బొంరాస్‌పేట ఉన్నత పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు విద్యార్థులకు సరిపోతున్నాయా అని జీహెచ్ఎం హరిలాల్‌ను అడిగారు. పాఠశాలల్లో ఏ చిన్న మరమ్మత్తు, అభివృద్ధి పని అయినా వదిలకుండా చేయించాలని సూచించారు. బడిబాట విజయవంతానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఎంఈవో రాంరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పాఠశాల విద్యార్థులకు యూనిఫాం వస్త్రాన్ని కటింగ్ చేసే పనిని పరిశీలించారు. విద్యార్థుల యూనిఫాం నాణ్యతగా కుట్టాలని పని వారిని రమేశ్ ఆదేశించారు. ఆయన జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఎంఈవో రాంరెడ్డి, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీహరిరెడ్డి, బొంరాస్‌పేట సీపీఎస్, జీయూపీఎస్ హెచ్ఎంలు అనిల్‌కుమార్, కాశీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కులకచర్ల, జూన్ 1 : కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో చేరేందుకు గిరిజన విద్యార్థులకు అవకాశం ఉందని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గంగారాంనాయక్ తెలిపారు. శనివారం కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో ఎస్టీ విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో చేరేందుకు సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. బైపీసీలో 36సీట్లు, ఎంపీసీలో 37 సీట్లుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలువు ఇవ్వాలి

ధారూరు, జూన్ 1 : అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు చేయించిన ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలవు (ఈఎస్ఎస్)ఇవ్వాలని ధారూరు మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. శనివారం ధారూరు మండల ఎంపీడీవో, ఎంఈవోకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. వారితో పాటు మండల గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, మండల అధ్యక్షుడు కె.మాణిక్యం, రాష్ట్ర బాధ్యులు రవీందర్‌రెడ్డి, అంజయ్య, వెంకటయ్య, సుదర్శన్, మోహన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహులు, మహేందర్, సత్యం, హీరమన్, శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్, మండల కార్యవర్గ సభ్యులు ఎల్లప్ప, శివకుమార్, శివరామకృష్ణ, మహిళా కార్యవర్గ సభ్యులు యశోదబాయి, జ్యోతి సరస్వతి, తులసీభవాని, అశ్విని లక్ష్మి ఉన్నారు.

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

ఏబ్బనూరు గ్రామ నర్సరీలో మొక్కలకు నీరు పోస్తున్న కూలీ

ధారూరు, జూన్ 1: నర్సరీలోని ప్రతి మొక్కనూ సంరక్షించాలని అధికారులు సూచిస్తున్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని ఎబ్బనూరు గ్రామంలోని నర్సరీలోని మొక్కలను రక్షించుకోవాడానికి రెండు పూటలు నీరు అందిస్తున్నారు. వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు నాటేందుకు మొక్కలను సిద్ధం చేస్తున్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా మొక్కలపై జాగ్రత్తలు పాటిస్తున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ధారూరులో విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీలక్ష్మి, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్

ధారూరు, జూన్ 1: మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ధారూరు మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీలక్ష్మి అన్నారు. శనివారం ధారూరు మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ సీడ్స్ దుకాణాలను ధారూరు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌తో కలిసి సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధారూరు మండల వ్యవసాయశాఖ అధికారి ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ విక్రయ కేంద్రాల్లోని నిర్వాకులు నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. వీరి వెంట పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతులకు కొనుగోలు రసీదు ఇవ్వాలి

మర్పల్లి : రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో ప్రశాంత్ అన్నారు. గురువారం మండలంలోని ఘనాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజ్ విత్తనాలు కొనుగోలు చేయరాదని, డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలన్నారు. డీలర్లు ఎంఆర్‌పీ ధరకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పెద్దేముల్, జూన్ 1 : క్రీడాకారులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్ కె.మహేశ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజురెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అల్లెంకల అశోక్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏఎస్ఐ బక్కన్న, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, క్రీడాకారులు, స్థానిక యువతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల డిప్యూటీ తహసీల్దార్ కె.మహేశ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజురెడ్డి మాట్లాడుతూ యువత క్రీడలు, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు అల్లెంకల అఖిల్ అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజురెడ్డి, ఏఎస్ఐ బక్కన్న, హెడ్‌కానిస్టేబుల్ రమేశ్, ఆర్గనైజర్లు వెంకట్, డీవై ప్రసాద్, సి.పాండు, మహమ్మద్ గౌస్, బంగ్ల రఘు, అశోక్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, నర్సింహ, ఆదర్శ్‌రెడ్డి, భాను, ఖయ్యూం, క్రీడాకారులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

పరిగి, జూన్ 1 : అమరవీరుల త్యాగాలు మరువలేనివని, తెలంగాణ కోసం అనేక మంది విద్యార్థులు అమరులయ్యారని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు శనివారం సాయంత్రం పరిగిలోని తెలంగాణ అమరవీరుల క్రాస్‌రోడ్డులో కొవ్వొత్తులు వెలిగించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి దశ, మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక మంది అమరులయ్యారని, వారి త్యాగాలను భావి తరాలకు సైతం గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొప్పుల రామకృష్ణారెడ్డి, రాకేశ్, బి.రవికుమార్, నాగేశ్వర్, వెంకటేశ్, గౌస్‌పాషా, అన్వర్‌హుస్సేన్, సేవ్యానాయక్, రాజు, ఆసిఫ్, శ్రీశైలం, ఫసియోద్దీన్ పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

బొంరాస్‌పేట : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు శనివారం రాత్రి మండలంలోని రేగడిమైలారం గ్రామంలో తెలంగాణ అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. గ్రామ పంచాయతీ సమీపంలోని అమర వీరుల స్థూపం వద్దకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమరులకు నివాళి అర్పించారు. తెలంగాణ సాధనలో అమరుల పాత్రను గుర్తు చేసుకుని వారిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామలయ్యగౌడ్, గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

ధారూరు, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిరార్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు ధారూరు ఎంపీడీవో నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధారూరు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. ధారూరు మండల జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దోమ తహసీల్దార్ కార్యాలయంలో..

దోమ : తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం దోమ మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయప్రదం చేయాలని ఆయన కోరారు.

బీటీ రోడ్డు మంజూరుపై హర్షం

బొంరాస్‌పేట, జూన్ 1 : మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని లింగ్యానాయక్‌తండాకు బీటీ రోడ్డు మంజూరు చేయడం పట్ల తండా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తండాకు బీటీ రోడ్డు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తండాకు బీటీ మంజూరు చేశారని వారు చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రవీణ్, కొత్తూరు మాజీ సర్పంచ్ మహేందర్, కిషన్‌నాయక్, సోమ్లానాయక్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నపాటి వర్షానికే కరెంటు కట్

పరిగి, జూన్ 1: పరిగి పట్టణంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కరెంటు లేక పట్టణవాసులు నానా ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో గాలివాన వచ్చింది. వర్షం కొద్దిపాటిగా కురిసినా కరెంటు పోయింది. సాయంత్రం 4 గంటల నుంచి కరెంటు లేక పట్టణవాసులు విలవిలలాడారు. రాత్రి సుమారు 10 గంటల వరకు కరెంటు లేకపోవడంతో పరిగి వాసులు ఇబ్బందులపాలయ్యారు. ఓవైపు వాణిజ్య సంస్థలలో కరెంటు కష్టాలతోపాటు అసలే వేసవికాలం కావడంతో ఉక్కపోత బాధ భరించలేక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే సుమారు 5 గంటలకు పైగా కరెంటు పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బడంగ్‌పేట, జూన్ 1: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం... మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ ఆగ్యకళానగర్‌కు చెందిన బాలణి(65) రోడ్డు దాటుతున్న క్రమంలో అతి వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 1: ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. ఎంబీఏ (నాన్ సీబీసీఎస్) ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కులకచర్ల, జూన్ 1 : చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో జరిగింది. కులకచర్ల ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కులకచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన చాకలి రాధిక(24) నారాయణపేట్ జిల్లా భూనీడు మండల కేంద్రానికి చెందిన చాకలి రఘునాథ్ కుమార్తె రాధికను బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన చాకలి ఆంజనేయులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి నలుగురు సంతానం కాగా, అందులో ముగ్గురు మృతి చెందారు. 4 సంవత్సరాల చిన్నారి ఉంది. మే 30న మృతురాలు భర్త ఆంజనేయులు రాధిక ఆరోగ్యం బాగాలేదని ఫోన్ చేశాడని, 31వ తేదీన మహబూబ్‌నగర్ ఎంవీఎస్ దవాఖాన తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందిందని తెలిపారు. రాధిక మృతిపై తమకు అనుమానం ఉందని మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వికారాబాద్, జూన్ 1 : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ –సదాశివపేట రైల్వే స్టేషన్ల మధ్య ఎర్రవల్లి గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని గ్రామస్తులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని వ్యక్తి (30) రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మరణించినట్లు స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఈ మేరకు వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

పలు కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 1: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ, ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి, బ్యాచలర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్, మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 19వ తేదీ నుంచి, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడిగా ఆచార్య పిల్లలమర్రి

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ)/కొండాపూర్: గచ్చిబౌలిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం, తెలుగు శాఖ అధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి రాములు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పదవీ ముగియడంతో నూతన శాఖ అధ్యక్షులుగా ఆచార్య పిల్లలమర్రి నియమితులయ్యారు. ఆయన పదవీలో మూడేండ్ల పాటు కొనసాగనున్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన వర్సిటీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాధాలు తెలిపారు. నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన రాములుకు ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యాపక వర్గం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎన్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటిస్ ఆచార్య ప్రభాకర్ రావు, పూర్వ శాఖాధ్యక్షులు దార్ల వెంకటేశ్వర్‌రావు, ఆచార్యాలు ఎం. గోనా నాయక్, డి.విజయలక్ష్మి, త్రివేణి, భూక్యా తిరుపతి, బాణాల భుజంగరెడ్డి, పి.విజయ్ కుమార్, బాశెట్టి లత, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో రూ.4.09 కోట్లు ఫ్రీజ్

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న రూ.4.09 కోట్లను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేసి, బాధితులకు న్యాయం చేశారు. వివరాల్లోకి వెళితే.., మే 1 నుంచి 31వరకు నెల రోజుల్లో పలు రకాల సైబర్ మోసాల బారిన పడి, ఆన్‌లైన్‌ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్న కేసులను నమోదు చేసుకున్న నగర సైబర్ క్రైమ్ పోలీసులు వేగవంతంగా, సమర్ధవంతమైన దర్యాప్తు జరిపారు. ఇందులో భాగంగా సైబర్ నేరస్తులకు చెందిన వివిధ బ్యాంకు ఖాతాల్లోని బాధితుల సొమ్ము రూ.4,09,23,217ను ఫ్రీజ్ చేశారు. ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశకు దూరంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులను నమ్మవద్దని, ఆన్‌లైన్ పరిచయాలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గ్రేటర్‌లో తొలిసారిగా పుష్పక్ ఏసీ రూట్ పాస్

సిటీబ్యూరో, జూన్ 1(నమస్తే తెలంగాణ): ఈసీఐఎల్ నుంచి సికింద్రాబాద్ మార్గంలో అదనంగా 8వ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను సోమవారం నుంచి నడపనున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఏఎస్ రావు నగర్ – సైనిక్‌పురి, అమ్ముగూడ – లాల్‌బజార్ – కార్ఖానా–జేబీఎస్ మార్గంలో బస్సులు ప్రతి 13 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనంతరం, గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ప్రయాణికుల కోసం తొలిసారిగా పుష్పక్ ఏసీ రూట్ పాస్‌ను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. శంషాబాద్, ఆరాంఘర్, బాలాపూర్, గచ్చిబౌలి నుంచి రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్ట్‌కు ప్రయాణించేందుకు ఈ పాస్ అందుబాటులో తీసుకొచ్చామని అన్నారు.

బీఈ కోర్సుల రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 1: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీఈ (నాన్ సీబీసీఎస్) సప్లమెంటరీ, బీఈ (ఏఐసీటీఈ) రెగ్యులర్, సప్లమెంటరీ, బీఈ (సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 7వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 10వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న భవనం

మణికొండలో తప్పిన పెనుప్రమాదం

మణికొండ, జూన్ 1: మణికొండ మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న భవనం పాక్షికంగా కూలిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నంబరు 13లో ఆర్ఆర్ టవర్స్ పేరిట నిర్మిస్తున్న భవనంలో అదనపు అంతస్తుల నిర్మాణాలు జరుగుతుండగా ఇటీవల స్లాబు పనులను పూర్తిచేశారు. కాగా శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా భవనంలోని స్లాబు కూలిపడుతుండటాన్ని అక్కడే ఉన్న సెక్యూరిటీ చూసి పరుగులు తీశారు. భారీ శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. నిర్మాణంలో ఉన్న భవనం ఓ వైపు పాక్షికంగా కూలింది. ఆ సమయంలో అక్కడ కూలీలెవ్వరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. గంట ముందు ఈ ఘటన చోటుచేసుకుంటే ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉండేదని స్థానిక ప్రజలు మండిపడ్డారు.

కొన్నాళ్లుగా మున్సిపాలిటీలో ఇలాంటి నిర్మాణాలు కోకొల్లలుగా జరుగుతున్నాయని, ఎలాంటి నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతోనే భవనం పాక్షికంగా కూలి ఉండొచ్చని ప్రజలు ఆరోపించారు. విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ యంత్రాంగం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఆన్‌లైన్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్ అరెస్ట్

రూ.6.70లక్షల విలువైన 16 గ్రాముల కొకైన్ సీజ్

సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ): టెలిగ్రామ్ వంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియన్ దేశస్తుడిని హెచ్–న్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్–న్యూ, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాల్ కేసు వివరాలను వెల్లడించారు. నైజీరియన్ దేశానికి చెందిన ఒకారొ కాస్మో రామ్సె అలియాస్ అండె కేమ్ బిజినెస్ వీసాపై 2014లో భారత్‌కు వచ్చి, నగరంలో స్థిరపడ్డాడు. నగరంలోని షేక్‌పేటలో నివాసముంటూ బట్టలను స్వదేశానికి ఎగుమతి చేసే వ్యాపార నిమిత్తం తరచూ తమిళనాడులోని తిరుప్పూర్ వెళ్లేవాడు. ఈ క్రమంలో స్వదేశానికి చెందిన అబ్రహం జాకబ్‌తో పరిచయం ఏర్పడి డ్రగ్స్ విక్రయించడం మొదలు పెట్టాడు. డ్రగ్స్ విక్రయిస్తూ 2016లో అబ్రహం జాకబ్‌తో పాటు ఒకారో కాస్మో రామ్సెను గోల్కొండ పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలైన తరువాత కూడా కాస్మో రామ్సె తన ప్రవర్తన మార్చుకోకుండా బెంగళూరుకు చెందిన మరో నైజీరియన్ ఒబాసి వద్ద నుంచి కొకైన్‌ను కొనుగోలు చేసి, నగరంలో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో 2018లో మరోసారి గోల్కొండ ఎక్సైజ్ పోలీసులకు సైతం కొకైన్ విక్రయిస్తూ పట్టుబడి జైలుకెళ్లాడు. జైలు నుంచి విడుదలైన తరువాత నిందితుడు మళ్లీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. అయితే తరచూ పోలీసులకు పట్టుబడుతుండటంతో పంథా మార్చుకున్న నిందితుడు టెలిగ్రామ్ వంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా నగరంలో అవసరమున్న వారికి కొకైన్ సరఫరా చేస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న హెచ్–న్యూ పోలీసులు నిందితుడి నివాసంపై దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.6.70లక్షల విలువ చేసే 16 గ్రాముల కొకైన్, సెల్‌ఫోన్, కారు, రూ.20వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, జీఎస్.డేనియల్, ఎస్ఐ వెంకటరాములు, ఫిల్మ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962